27-08-2024 ప్రాత:మురళి ఓంశాంతి ''బాప్ దాదా'' మధువనం

"మధురమైన పిల్లలూ - చైతన్య అవస్థలో ఉంటూ తండ్రిని స్మృతి చేయాలి, స్తబ్ధావస్థలోకి వెళ్ళిపోవడము లేక నిదురపోవడము - ఇదేమీ యోగము కాదు"

ప్రశ్న:- మీకు కళ్ళు మూసుకొని కూర్చోవద్దు అని ఎందుకు చెప్పడం జరుగుతుంది?

జవాబు:- ఒకవేళ మీరు కళ్ళు మూసుకొని కూర్చున్నట్లయితే దుకాణములోని సామానునంతటినీ దొంగలు దోచుకుని వెళ్ళిపోతారు. మాయ రూపీ దొంగ బుద్ధిలో ఏమీ ధారణ అవ్వనివ్వదు. కళ్ళు మూసుకొని యోగములో కూర్చున్నట్లయితే నిద్ర వచ్చేస్తుంది, ఏమీ తెలియదు. అందుకే కళ్ళు తెరుచుకొని కూర్చోవాలి. అన్ని పనులు చేసుకుంటూ బుద్ధి ద్వారా తండ్రిని స్మృతి చేయాలి. ఇందులో హఠయోగము యొక్క విషయమేదీ లేదు.

ఓం శాంతి. ఆత్మిక తండ్రి పిల్లలకు చెప్తారు, ఇతను కూడా బిడ్డే కదా. దేహధారులందరూ పిల్లలే. కావున ఆత్మిక తండ్రి ఆత్మలకు చెప్తారు, ఆత్మయే ముఖ్యమైనది. దీనిని బాగా అర్థం చేసుకోండి. ఇక్కడ ఎదురుగా కూర్చున్నప్పుడు శరీరము నుండి అతీతముగా అయి మాయమైపోవడం కాదు. శరీరము నుండి అతీతముగా అయి మాయమైపోవడమంటే, అదేమీ స్మృతియాత్ర యొక్క అవస్థ కాదు. ఇక్కడైతే సుజాగృతులుగా కూర్చోవాలి. నడుస్తూ, తిరుగుతూ, లేస్తూ, కూర్చుంటూ స్వయాన్ని ఆత్మగా భావిస్తూ తండ్రిని స్మృతి చేయాలి. తండ్రి ఏమీ ఇక్కడ కూర్చొని స్పృహ కోల్పోండి అని చెప్పరు. ఇలా ఎంతోమంది కూర్చుని-కూర్చుని స్తబ్ధముగా అయిపోతారు. మీరైతే సుజాగృతులుగా అయి కూర్చోవాలి మరియు పవిత్రముగా కూడా అవ్వాలి. పవిత్రత లేకుండా ధారణ జరుగదు, ఎవరి కళ్యాణాన్ని చేయలేరు, ఎవరికీ చెప్పలేరు. ఎవరైతే స్వయం పవిత్రముగా ఉండకుండా ఇతరులకు చెప్తూ ఉంటారో వారు పండితులవంటివారు. నాకు అన్నీ తెలుసు అని అనుకునేవారిగా కూడా అవ్వకూడదు. అలా చేస్తే మనసు లోలోపల తింటూ ఉంటుంది. మేము స్తబ్ధావస్థలోకి వెళ్ళిపోతాము, కళ్ళు మూసుకుపోతాయి అని భావించకండి, అదేమీ స్మృతి యొక్క అవస్థ కాదు, ఇక్కడ చైతన్యావస్థలో ఉంటూ తండ్రిని స్మృతి చేయాలి. నిదురపోవడం అనేది స్మృతి చేయడమేమీ కాదు. పిల్లలకు ఎన్నో పాయింట్లను అర్థం చేయించడం జరుగుతుంది. 7వ లోకములోకి వెళ్ళిపోతారని, వారికి ప్రపంచం గురించి తెలియదని శాస్త్రాలలో చూపించడం జరిగింది, కానీ మీకైతే ప్రపంచం గురించి తెలుసు కదా. ఇది ఛీ-ఛీ ప్రపంచము. తండ్రి గురించి ఎవరికీ తెలియదు. ఒకవేళ తండ్రి గురించి తెలిస్తే సృష్టి చక్రము గురించి కూడా తెలుస్తుంది. ఈ చక్రము ఎలా తిరుగుతుంది, మనుష్యులు పునర్జన్మలను ఎలా తీసుకుంటారు అనేది తండ్రి తెలియజేస్తారు. సత్యయుగములో వయసు పెరిగినా సౌందర్యము పోదు. ఇకపోతే సన్యాసులది హఠయోగము. కళ్ళు మూసుకోవడం, గుహల్లో కూర్చుంటూ-కూర్చుంటూ అందవిహీనంగా తయారవ్వడం... అదంతా హఠయోగము. మీకైతే తండ్రి చెప్తున్నారు, గృహస్థ వ్యవహారములో ఉంటూ సుజాగృతులుగా ఉండాలి. స్తబ్ధతలోకి వెళ్ళిపోవడం, అదేమీ అవస్థ కాదు. వ్యాపారాలు మొదలైనవి కూడా చేయాలి, గృహస్థ వ్యవహారాన్ని కూడా సంభాళించాలి. స్తబ్ధతలోకి వెళ్ళిపోకూడదు. కార్యవ్యవహారాలు చేస్తూ బుద్ధి ద్వారా తండ్రిని స్మృతి చేయాలి. పనులు చేసేటప్పుడు తప్పకుండా కళ్ళు తెరిచే చేస్తారు కదా. వ్యాపారాలు మొదలైనవన్నీ చేస్తూ ఉండండి, బుద్ధియోగము తండ్రితో ఉండాలి, ఇందులో నిర్లక్ష్యం చేయకూడదు. దుకాణములో కూర్చున్నప్పుడు కళ్ళు మూసుకుపోతే ఎవరైనా సామానులను ఎత్తుకుపోతారు కానీ తెలియను కూడా తెలియదు. అది అవస్థ ఏమీ కాదు. మేము దేహము నుండి అతీతమైపోతాము అన్నవన్నీ హఠయోగుల విషయాలు. అవి రిద్ధి-సిద్ధి చేసేవారు చేస్తారు. తండ్రి అయితే మంచి రీతిలో కూర్చొని అర్థం చేయిస్తారు, ఇందులో కళ్ళు మూసుకోకూడదు.

తండ్రి అంటారు, మిత్ర-సంబంధీకులు మొదలైనవారినెవరినైతే స్మృతి చేస్తారో, వారినందరినీ మర్చిపోండి. ఒక్క తండ్రినే స్మృతి చేయాలి. స్మృతియాత్రతో తప్ప పాపాలు అంతమవ్వవు. భోగ్ తీసుకువెళ్తారు, సూక్ష్మవతనములో మాయమైపోతారు. అందులో ఏమవుతుంది? ఎంతసేపైతే అక్కడ ఉంటారో అంతసేపూ వికర్మలు వినాశనమవ్వవు, శివబాబాను స్మృతి చేయలేరు, అలాగే బాబా వాణిని కూడా వినలేరు, అప్పుడు నష్టం వాటిల్లుతుంది. కానీ ఇది డ్రామాలో రచింపబడి ఉంది, అందుకే అక్కడకు వెళ్తారు, మళ్ళీ వచ్చి మురళి వింటారు, అందుకే తండ్రి అంటారు, వెళ్ళండి కానీ వెంటనే వచ్చేయండి, అక్కడ కూర్చుండిపోకండి. ఆట-పాటలను చేయడాన్ని బాబా ఆపు చేసారు. ఇది కూడా విహరించడం, తిరగడం, భ్రమించడం వంటిదే కదా. భక్తి మార్గములో ఇలా భ్రమించడము, ఎదురుదెబ్బలు

తినడము ఎంతో జరుగుతూ ఉంటుంది ఎందుకంటే అది అంధకార మార్గము కదా. మీరా ధ్యానములో వైకుంఠములోకి వెళ్ళిపోయేవారు. కానీ అది యోగము లేక చదువేమీ కాదు. ఆమె సద్గతిని ఏమైనా పొందారా? స్వర్గములోకి వెళ్ళేందుకు అర్హురాలిగా అయ్యారా? జన్మజన్మాంతరాల పాపాలు అంతమయ్యాయా? ఏమాత్రమూ అవ్వలేదు. జన్మజన్మాంతరాల పాపాలైతే తండ్రి స్మృతి ద్వారానే అంతమవుతాయి. ఇకపోతే సాక్షాత్కారాలు మొదలైనవాటి వలన ఎటువంటి లాభమూ లేదు. అది కేవలం భక్తి మాత్రమే. అది స్మృతీ కాదు, జ్ఞానమూ కాదు. భక్తి మార్గములో ఇవి నేర్పించేవారు ఎవరూ లేరు కావున సద్గతిని కూడా పొందరు, ఎన్ని సాక్షాత్కారాలు జరిగినా సద్గతిని పొందరు. ప్రారంభంలోనైతే కుమార్తెలు తమకు తామే ధ్యానములోకి వెళ్ళిపోయేవారు. మమ్మా, బాబా వెళ్ళేవారు కాదు. ప్రారంభములో బాబాకు కేవలం స్థాపన మరియు వినాశన సాక్షాత్కారం జరిగింది. ఆ తర్వాత ఏమీ జరగలేదు. నేను ఎవ్వరినీ ధ్యానములోకి పంపించను. అయితే, వారిని కూర్చోబెట్టి - బాబా, వీరి బుద్ధి తాడును లాగండి అని అంటారు. అది కూడా డ్రామాలో ఉంటే తాడును లాగుతారు, లేదంటే లేదు. సాక్షాత్కారాలైతే ఎన్నో జరుగుతాయి. ప్రారంభములో ఎన్నో సాక్షాత్కారాలు పొందేవారు, చివరిలో కూడా ఎన్నో సాక్షాత్కారాలు పొందుతారు. వేటగానికి వేట, వేటకు మృత్యువు... లెక్కలేనంతమంది మనుష్యులు ఉన్నారు, వారందరూ శరీరాలను వదిలేస్తారు. శరీర సహితముగా ఎవరూ సత్యయుగములోకి లేక శాంతిధామములోకి వెళ్ళరు. ఎంతమంది మనుష్యులు ఉన్నారు, అందరూ వినాశనమైపోతారు. ఇకపోతే ఒక్క ఆది సనాతన దేవీ-దేవతా ధర్మ స్థాపన బ్రహ్మా ద్వారా జరుగుతోంది. కుమార్తెలైన మీరు పల్లె-పల్లెలోకి వెళ్ళి ఎంత సేవను చేస్తారు. స్వయాన్ని ఆత్మగా భావిస్తూ తండ్రిని స్మృతి చేయండి అనే చెప్తారు. సన్యాసులకైతే రాజయోగాన్ని నేర్పించడం తెలియదు. తండ్రి తప్ప ఇంకెవరు రాజయోగాన్ని నేర్పిస్తారు? పిల్లలైన మీకు తండ్రి ఇప్పుడు రాజయోగాన్ని నేర్పిస్తున్నారు. ఆ తర్వాత ఇక రాజ్యం లభిస్తుంది. మీరు అపారమైన సుఖాలలో ఉంటారు. అక్కడ ఇక స్మృతి చేయవలసిన అవసరమే లేదు. అంశమాత్రము కూడా దుఃఖము ఉండదు. ఆయువు కూడా పెద్దగా ఉంటుంది, శరీరము కూడా నిరోగిగా ఉంటుంది. ఇక్కడ ఎన్ని దుఃఖాలు ఉన్నాయి. తండ్రి దుఃఖము కొరకే ఆటను రచించారని కాదు. ఇది సుఖ-దుఃఖాల, గెలుపు-ఓటముల, ఆది-అనాది ఆట. ఈ విషయాలన్నింటినీ గురించి సన్యాసులకు తెలియనే తెలియదు కావున వారు ఎలా అర్థం చేయించగలరు. వారైతే భక్తి మార్గపు శాస్త్రాలు మొదలైనవి చదువుతారు. స్వయాన్ని ఆత్మగా భావిస్తూ తండ్రిని స్మృతి చేయండి అని మీకు చెప్పడం జరుగుతుంది. ఆ సన్యాసులైతే ఆత్మగా భావిస్తూ బ్రహ్మ తత్వాన్ని స్మృతి చేస్తారు, బ్రహ్మ తత్వాన్ని పరమాత్మగా భావిస్తారు, వారు బ్రహ్మ జ్ఞానులు. వాస్తవానికి బ్రహ్మ తత్వము నివసించే స్థానము. అక్కడ ఆత్మలైన మీరు ఉంటారు. వారేమో మేము అందులో లీనమైపోతాము అని అంటారు. వారి జ్ఞానమే తలక్రిందుల జ్ఞానం. ఇక్కడైతే అనంతమైన తండ్రి పిల్లలైన మిమ్మల్ని చదివిస్తారు. భగవంతుడు ఇంకా 40,000 సంవత్సరాల తర్వాత వస్తారు అని వారు అంటారు, దీనిని అజ్ఞానాంధకారము అని అంటారు. తండ్రి అంటారు, కొత్త ప్రపంచ స్థాపనను మరియు పాత ప్రపంచ వినాశనమును చేయించేది నేనే. నేను స్థాపన చేస్తున్నాను, వినాశనం కూడా ఎదురుగా నిలబడి ఉంది. ఇప్పుడు త్వరగా చేయండి. పావనంగా అవ్వండి, అప్పుడే పావన ప్రపంచములోకి వెళ్తారు. ఇదైతే పాత తమోప్రధాన ప్రపంచము. ఇది లక్ష్మీ-నారాయణుల రాజ్యం కాదు. వీరి రాజ్యం కొత్త ప్రపంచములో ఉండేది, ఇప్పుడు అది లేదు. వీరు పునర్జన్మలు తీసుకుంటూ వచ్చారు. శాస్త్రాలలో అయితే ఏవేవో వ్రాసేసారు. కృష్ణుడు అర్జునుడి గుర్రపు బండి మీద కూర్చున్నట్లుగా చూపించారు. అర్జునుడి లోపల కృష్ణుడు కూర్చున్నారు అని కాదు. కృష్ణుడైతే దేహధారి కదా. అలాగే యుద్ధము మొదలైన విషయాలేవీ కూడా ఏమీ లేవు. వారైతే పాండవులు మరియు కౌరవుల సైన్యాన్ని వేరు-వేరుగా చూపించారు. కానీ ఇక్కడైతే ఆ విషయమేదీ లేదు. ఇవి భక్తి మార్గానికి చెందిన లెక్కలేనన్ని శాస్త్రాలు. సత్యయుగములో ఇవేవీ ఉండవు. అక్కడైతే జ్ఞానము యొక్క ప్రారబ్ధముగా రాజధాని ఉంటుంది. అక్కడ అంతా సుఖమే సుఖము. తండ్రి కొత్త ప్రపంచ స్థాపనను చేస్తారు కావున తప్పకుండా కొత్త ప్రపంచములో సుఖము ఉంటుంది కదా. తండ్రి ఎప్పుడైనా పాత ఇంటిని నిర్మిస్తారా. తండ్రి అయితే కొత్త ఇంటిని నిర్మిస్తారు. ఆ ప్రపంచాన్నే సతోప్రధాన ప్రపంచము అని అంటారు. ఇప్పుడైతే అంతా తమోప్రధానులుగా, అపవిత్రులుగా ఉన్నారు, పరాయి రావణ రాజ్యములో కూర్చున్నారు.

రాముడు అని శివబాబానే అంటారు, రామ-రామ అంటూ రామ నామాన్ని దానం చేస్తారు. రాముడెక్కడ, శివబాబా ఎక్కడ. ఇప్పుడు శివబాబా పిల్లలైన మీకు చెప్తున్నారు - నన్నొక్కరినే స్మృతి చేయండి. ఎక్కడి నుండైతే వచ్చారో అక్కడికే మళ్ళీ వెళ్ళాలి, ఎప్పటివరకైతే తండ్రిని స్మృతి చేసి పవిత్రంగా అవ్వరో అప్పటివరకు తిరిగి వెళ్ళలేరు కూడా. తండ్రిని బాగా స్మృతి చేసేవారు మీలో కూడా ఏ ఒక్కరో ఉంటారు. ఇక్కడ నోటితో అనవలసిన విషయమేమీ లేదు. భక్తిలో రామ-రామ అని నోటితో అంటారు. ఎవరైనా అలా అనకపోతే వారిని నాస్తికులుగా భావిస్తారు. ఎంత శబ్దం చేస్తూ పాడుతూ ఉంటారు. ఎంతగా వృక్షం పెద్దదవుతూ ఉంటుందో అంతగా భక్తి సామాగ్రి కూడా పెరుగుతూ ఉంటుంది. బీజం

ఎంత చిన్నగా ఉంటుంది. మీ వద్ద ఏ వస్తువూ లేదు, ఎటువంటి శబ్దమూ లేదు. కేవలం స్వయాన్ని ఆత్మగా భావిస్తూ నన్ను స్మృతి చేయండి అని అంటారు. మీరు నోటితో అనేది కూడా లేదు. లౌకిక తండ్రిని కూడా పిల్లలు బుద్ధి ద్వారానే స్మృతి చేస్తారు, అంతేకానీ కూర్చుని తండ్రి-తండ్రి అని అనరు కదా. ఆత్మల తండ్రి ఎవరు అనేది ఇప్పుడు మీకు తెలుసు. ఆత్మలందరూ పరస్పరం సోదరులే. ఆత్మకు ఇంకే పేరూ లేదు. ఇకపోతే శరీరము యొక్క పేరు మారుతుంది. ఆత్మ అయితే ఆత్మయే. వారు కూడా పరమ ఆత్మయే. వారి పేరు శివ. వారికి తమ శరీరము లేదు. తండ్రి అంటారు, నాకు కూడా ఒకవేళ శరీరము ఉన్నట్లయితే పునర్జన్మలలోకి రావలసి వస్తుంది. మరి అప్పుడు మీకు సద్గతిని ఎవరు ఇస్తారు? భక్తి మార్గములో నన్ను స్మృతి చేస్తారు. అనేక చిత్రాలు ఉన్నాయి. ఇప్పుడు మీరు నరకవాసుల నుండి స్వర్గవాసులుగా అవుతారు కదా. జన్మనైతే నరకములో తీసుకున్నారు, మరణించడం స్వర్గము కోసం మరణిస్తారు. ఇక్కడకు మీరు స్వర్గములోకి వెళ్ళేందుకే వచ్చారు. ఏదైనా బ్రిడ్జి మొదలైనవి నిర్మించినప్పుడు మొదట శంఖుస్థాపనను చేస్తారు, ఆ తర్వాత బ్రిడ్జి తయారవుతూ ఉంటుంది. అలాగే స్వర్గ స్థాపనకు ప్రారంభోత్సవం (శంఖుస్థాపన) తండ్రి చేసేసారు, ఇప్పుడిక ఏర్పాట్లు జరుగుతూ ఉంటాయి. ఇల్లు తయారవ్వడానికి సమయమేమైనా పడుతుందా? గవర్నమెంట్ చేయడం మొదలుపెడితే ఒక్క నెలలో ఇల్లు నిర్మించగలుగుతుంది. విదేశాల్లోనైతే ఇళ్ళు రెడీమేడ్ గా లభిస్తాయి. స్వర్గములోనైతే చాలా విశాలబుద్ధి కలవారిగా, సతోప్రధానంగా ఉంటారు. సైన్సువారి బుద్ధి చురుకుగా ఉంటుంది. వెంటనే-వెంటనే తయారుచేస్తూ ఉంటారు, ఇళ్ళల్లో రత్నాలు కూడా పొదగబడుతూ ఉంటాయి. ఈ రోజుల్లో ఇమిటేషన్ ను చూడండి, ఎంత త్వరగా తయారుచేస్తూ ఉంటారు. అదైతే నిజమైన దాని కన్నా ఎక్కువగా మెరుస్తుంది. అందులోనూ ఈ రోజుల్లోని మెషినరీతోనైతే వెంటనే తయారుచేస్తారు. అక్కడ ఇళ్ళు నిర్మించడానికి సమయం పట్టదు, శుభ్రం అవ్వడానికే సమయం పడుతుంది. బంగారు ద్వారక సముద్రంలో నుండి పైకి వస్తుందని కాదు. తండ్రి అంటారు - తినండి, తాగండి కానీ కేవలం తండ్రిని స్మృతి చేయండి, అప్పుడు వికర్మలు వినాశనమవుతాయి, ఇంకే ఉపాయమూ లేదు. జన్మ-జన్మాంతరాలుగా ఈ గంగా స్నానాలు మొదలైనవి చేస్తూ వచ్చారు కానీ ఎవ్వరూ ముక్తి-జీవన్ముక్తినైతే పొందనే పొందరు. ఇక్కడైతే తండ్రి పావనంగా అయ్యేందుకు యుక్తిని తెలియజేస్తారు. తండ్రి అంటారు - నేనే పతిత-పావనుడను. ఓ పతిత-పావన బాబా రండి, మీరు వచ్చి మమ్మల్ని పావనంగా తయారుచేయండి అని మీరు పిలిచారు. డ్రామా పూర్తయ్యాక ఇక పాత్రధారులందరూ స్టేజి పైన ఉండాలి. రచయిత కూడా ఉండాలి. అందరూ లేచి నిలబడతారు కదా. ఇక్కడ కూడా అలాగే జరుగుతుంది. ఆత్మలందరూ వచ్చేస్తారు, ఆ తర్వాత తిరిగి వెళ్ళాల్సి ఉంటుంది. ఇప్పుడు మీరు ఇంకా తయారవ్వలేదు. కర్మాతీత అవస్థయే తయారవ్వకపోతే మరి వినాశనం ఎలా జరుగుతుంది. తండ్రి వచ్చేదే మిమ్మల్ని కొత్త ప్రపంచం కోసం చదివించడానికి, అక్కడ మృత్యువు అనేదే ఉండదు. మీరు మృత్యువుపై విజయాన్ని పొందుతారు. ఎవరు విజయాన్ని ప్రాప్తింపజేయిస్తారు? కాలుడికే కాలుడు. వారు ఎంతమందిని తమతో పాటు తీసుకువెళ్తారు! మీరు సంతోషంగా వెళ్తారు. ఇప్పుడు తండ్రి, అందరి దుఃఖాలనూ దూరం చేయడానికి వచ్చారు, అందుకే వారి మహిమను గానం చేస్తారు - గాడ్ ఫాదర్, మమ్మల్ని దుఃఖం నుండి విముక్తులుగా చేయండి, శాంతిధామము-సుఖధామములోకి తీసుకువెళ్ళండి అని. కానీ ఇప్పుడు తండ్రి స్వర్గం యొక్క రచనను రచిస్తున్నారు అన్నది మనుష్యులకు తెలియదు. మీరు స్వర్గములోకి వెళ్తారు, అక్కడ వృక్షం చాలా చిన్నగా ఉంటుంది, అది మళ్ళీ వృద్ధి చెందుతుంది. ఇప్పుడు మిగిలిన ధర్మాలన్నీ ఉన్నాయి కానీ ఆ ఒక్క ధర్మము లేదు. నామ-రూపాలు, రాజ్యము మొదలైనవన్నీ మారిపోతాయి. మొదట డబుల్ కిరీటధారులుగా ఉంటారు, ఆ తర్వాత సింగిల్ కిరీటధారులుగా ఉంటారు. సోమనాథ మందిరాన్ని నిర్మించారు, ఎంత ధనం ఉండేది. అన్నింటికన్నా పెద్ద మందిరం ఒక్కటే, దానిని దోచుకుని వెళ్ళిపోయారు. తండ్రి అంటారు - మీరు పదమాపదమ భాగ్యశాలిగా అవుతారు. అడుగడుగులోనూ తండ్రిని స్మృతి చేస్తూ ఉన్నట్లయితే పదమాలు జమ అవుతాయి. తండ్రిని స్మృతి చేయడం వలన అంతటి సంపాదన కలుగుతుంది. మరి అటువంటి తండ్రిని స్మృతి చేయడము మీరెందుకు మర్చిపోతారు? ఎంతగా తండ్రిని స్మృతి చేస్తారో, సేవ చేస్తారో అంతగా ఉన్నత పదవిని పొందుతారు. మంచి-మంచి పిల్లలు నడుస్తూ-నడుస్తూ పడిపోతారు. నల్ల ముఖం చేసుకున్నట్లయితే చేసుకున్న సంపాదన అంతా అంతమైపోతుంది. గొప్ప లాటరీని పోగొట్టుకుంటారు. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. గృహస్థ వ్యవహారాన్ని సంభాళిస్తూ బుద్ధియోగాన్ని తండ్రితో జోడించాలి. నిర్లక్ష్యము చేయకూడదు. పవిత్రతా ధారణతో

స్వ మరియు సర్వుల కళ్యాణాన్ని చేయాలి.

2. స్మృతియాత్ర మరియు చదువులోనే సంపాదన ఉంది. ధ్యానము, సాక్షాత్కారాలు అనేవి భ్రమించడం మాత్రమే. అందుకే వాటి వల్ల ఎటువంటి లాభమూ లేదు. ఎంత వీలైతే అంత సుజాగృతులుగా అయి తండ్రిని స్మృతి చేస్తూ మీ వికర్మలను వినాశనం చేసుకోవాలి.

వరదానము:- శ్రేష్ఠ స్మృతి ద్వారా శ్రేష్ఠ స్థితిని, శ్రేష్ఠ వాయుమండలాన్ని తయారుచేసే సర్వుల సహయోగీ భవ

యోగము అనగా అర్థము - శ్రేష్ఠ స్మృతిలో ఉండటము. శ్రేష్ఠ ఆత్మనైన నేను శ్రేష్ఠమైన తండ్రి సంతానాన్ని - ఎప్పుడైతే ఇటువంటి స్మృతి ఉంటుందో అప్పుడు స్థితి శ్రేష్ఠముగా తయారవుతుంది. శ్రేష్ఠ స్థితితో శ్రేష్ఠ వాయుమండలము స్వతహాగా తయారవుతుంది, అది అనేక ఆత్మలను తనవైపుకు ఆకర్షిస్తుంది. ఎక్కడెక్కడైతే ఆత్మలైన మీరు యోగములో ఉంటూ కర్మలు చేస్తారో, అక్కడి వాతావరణము, వాయుమండలము ఇతరులకు కూడా సహయోగాన్ని ఇస్తుంది. ఇటువంటి సహయోగీ ఆత్మలు తండ్రికి మరియు విశ్వానికి ప్రియమైనవారిగా అవుతారు.

స్లోగన్:- అచల స్థితి అనే ఆసనముపై కూర్చోవడము ద్వారానే రాజ్య సింహాసనము లభిస్తుంది.